


# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

కూతుర్ని అలా చూసిన రాధిక మరొకసారి మరింత దగ్గరగా తీసుకుని హృదయానికి హత్తుకుంది.

ఇద్దరిమధ్యా కొన్ని క్షణాల పాటు మౌనం.

అమ్మ స్పర్శలో ఎన్నో విషయాలు తెలిసీ తెలియనట్టే అనిపించింది స్వప్నికి.

రాధిక కూడా ఇదీ అని చెప్పలని భావంతో కూతురిని తనలోకి మరింతగా పొదువుకుంటూ వెన్ను రాస్తూ, చెదిరిన ముంగురులు సవరిస్తూ ఉండిపోయింది.

పాప ప్రశ్నలు వెయ్యలేదు, తల్లి ఏమీ చెప్పలేదు. ఇద్దరి కళ్ళల్లోంచీ ఒకేరకంగా ధారగా కారుతున్న కన్నీరు.

తుడిచే ప్రయత్నం కానీ, తుడుచుకునే ప్రయత్నం కానీ ఏ ఒక్కరూ చెయ్యలేదు. మాటల్లేని మూగబొమ్మల్లా అలా కొన్ని నిమిషాలుండిపోయారు.

ఒంట్లో పెరుగుతున్న నిస్సత్తువ, నీరసం వల్ల స్వప్నికి తల్లి కౌగిలింతవల్ల పక్కటెముకలు నొక్కుకున్నట్టయ్యి, నొప్పిగా అనిపించింది. అయినా ఆమెకి అమ్మకి అంత దగ్గరగా ఉండడం చాలా బావుంది.

నెమ్మదిగా 'ఊ' అంటూ మూలుగుతూనే తల్లిని మరింతగా అల్లుకుపోయింది భుజం మీద తలవాల్చుకుని మెడవంపులోకి దూరి వెక్కిళ్ళు పెట్టసాగింది.

కొద్దిసేపటి తర్వాత రాధికే ముందు తేరుకుని, తన చీర కొంగుతో తన కళ్ళు, స్వప్ని కళ్ళూ, ముఖమూ తుడిచింది. ఆ తర్వాత లోపలకి వెళ్ళి వేడి నీళ్ళల్లో ముంచి పిండిన చిన్న చేతి టవల్ తెచ్చి స్వప్నిక కళ్ళూ, ముఖమూ, చేతులూ, మెడా తుడిచింది.

" వేడిగా పాలు తేనా తల్లీ" అంది లాలనగా.

" వద్దమ్మా, ముందు నాకేమైందో చెప్పు? ఏమయింది నాకు? నాకు లుకేమియానా? అంటే కేన్సర్ కదా? అందుకే నేనిలా తరచుగా జ్వరపడుతున్నానా? ఇవన్నీ మీ అందరికీ ఇప్పటికే తెలుసా? డాక్టరంకుల్ చెప్పారా, లేదా స్నేహా ఆంటీనా?

నాన్నా, శేఖర్ అంకుల్, రోహిణీ ఆంటీ, నువ్వు! మీ అందరికీ తెలుసా నాకేమయిందో?

అసలు నాకేమిటి సమస్య? మీరు నాకెందుకు చెప్పలేదు ఏమీ? మాములు జ్వరం కాదుగా అమ్మా, అదే అయితే ఇన్ని రోజులు సతాయించదు కదా..

నాకు.. నేను..” ఆపైన మాటలు రాలేదా అమ్మాయికి.

కొద్దిగా ధైర్యం కూడగట్టుకుంటున్న రాధిక హతాశురాలైంది.

ఏం చెప్పాలో, ఎంత చెప్పాలో తెలియక నిస్సహాయురాలైంది. అంతలో దేవుడే పంపినట్టు వచ్చింది రోహిణి " మా స్వప్ని పాపకి మిఠాయి" అంటూ చేతిలో కప్పుతో.

వచ్చిన రెండు క్షణల్లో ఆమెకర్థమైంది అక్కడి పరిస్థితి.

“ఏమయింది రాధీ? ఏం స్వప్ని పాపా, ఏమిటిరా?” అంటూ వచ్చిన ఆమె క్షణల్లోనేరాధిక నిస్సహాయత, స్వప్నిక కోపం, ఉక్రోషం చూసింది.

" అత్తా! దేవుడు ఇచ్చిన కూతురు మా స్వప్ని బంగారం అంటావు కదా, నువ్వు కూడా నాకేమీ చెప్పలేదెందుకు? ఏమయింది నాకు. నాకేమీ తెలియక ఎంత గందరగోళంగా ఉందో తెలుసా? ప్లీజ్ నువ్వైనా చెప్పు అసలు విషయం ఏమిటో? " అంటూ ఆమెని పట్టుకుని మళ్ళీ ఏడుపు మొదలు పెట్టింది స్వప్నిక.

" ఏమీ లేదు కన్నా, కొద్దిగా జ్వరం, దిష్టి కద, అన్ని మెడల్స్ నీవేనాయే" అంటూ ఏదో సముదాయించే విఫల ప్రయత్నం చెయ్యబోయింది ఆమె.

" అలాగా! అయితే ఆ దిష్టి పోవడానికేనా రాజేష్ అంకుల్ ఈ ప్రకటన ఇచ్చారు? నా పేషెంట్ ఫలానా అథ్లీట్ అయిన అమ్మాయికి డబ్బు కావాలని"

ఇంత అని చెప్పలేనంత కోపం ఆ పసిదానిలో చూసి తల్లడిల్లిపోయింది రోహిణి.

" నేనూ అమ్మా నీకు అన్ని విషయాలు చెప్తాం గా, లే, మా బంగారం కదూ, ఇంత కోపంగా ఉంటే ఎలా? కాస్త పాలు తాగితే బలం వస్తుంది. అప్పుడు మంచం మీద హాయిగా పడుకున్నాకా చెప్తాం, సరేనా? పో రాధీ, పోయి స్వప్నికి వేడి గా పాలు కలిపి తీసుకురా, బోర్నవిటా ఎక్కువగా" అంటూ కొద్దిగా మాట మార్చడానికి ప్రయత్నిస్తూ కంప్యూటర్ ని మూసి పక్కన పెట్టింది.

" చెప్తానంటేనే పాలు తాగుతాను" అంటూ బెదిరిస్తూ రెండు గుక్కలు వేడి పాలు తాగింది స్వప్నిక.

" గుడ్," అంటూ పక్కన కూర్చుంది రోహిణి.

రాధిక కూడా పక్కకు చేర్తుతూ " కాసేపు పడుకుంటావా?" అంది నెమ్మదిగా

" మాట మార్చద్దు అమ్మా, మీరిద్దరూ చేసిన ప్రామిస్ మర్చిపోవద్దు" అంది స్వప్నిక.

ఇంక తప్పలేదు స్నేహితురాళ్ళిద్దరికీ.

గట్టిగా చర్చించుకునే వీలు కూడా లేదు, కళ్ళతోనే మాట్లాడుకున్నారు ఇద్దరూ.

" అమ్మకి బెంగగా ఉంది కదా, నేనే మొదలుపెడతానులే" అంది రోహిణి.

" ఎవరో ఒకరు చెప్పండి ప్లీజ్, ఈ టెన్షన్ తట్టుకోలేక పోతున్నాను అత్తా. అర్థం చేసుకోండి నా బాధ" అంది స్వప్నిక దీనంగా.

నెమ్మదిగా, వీలైనంత క్లుప్తంగా పరిస్థితిని చెప్పారు ఇద్దరూ.

పరిస్థితిని అర్థం చేసుకుని, రాజీపడుతూ, ఎదుర్కోవడానికి ధైర్యాన్ని పుంజుకుంటున్న రాధిక చాలా ప్రయత్నం మీద బాలన్సెడ్ గా వివరాలు చెప్పగలిగింది.

స్వప్నిక ఆ రోజు రేస్ లో పడిపోయినప్పటినించీ ఇప్పటివరకూ జరిగినవిషయాలన్నీ దాచకుండా, మరీ వివరంగా కాకుండా చెప్పింది.

" మనం చాలా ముందే చూసుకున్నాం, అందువల్ల మన స్వప్ని చాలా తొందరగా కోలుకుంటుంది, అస్సలు ఏమీ భయం లేదు! అని డాక్టర్ రాజేష్ అంకుల్ పదే పదే చెప్పారు. కానైతే ఇలాంటివాటికి కావలసిన మందులూ, ట్రీట్ మెంట్ అవీ ఖరీదుగా ఉంటాయి కనక, మనక్కొంత సహాయం దొరికితే మంచిదని ఆయన అభిప్రాయం. అందువల్లే ఆ ప్రకటన ఇచ్చారు." అంటూ ఆగింది రాధిక.

" ఇంక నీకు చెప్పకపోవడం అంటే డాక్టర్ సుజిత్ అన్నారు కదా, దాని గురించి మీరే మీ వర్రీ అవద్దు. పాప మేలు కోరే మంచి డాక్టర్లు గా ఎప్పుడు చెప్పాలో మాకు తెలుసు, అది మాకు వదిలేయండి. మీరు స్వప్ని ఎప్పుడూ సంతోషంగా ఉండేలా చూసుకోండి చాలు అన్నారు. అందుకే మేము నీకేమీ చెప్పలేకపోయాం. అంతే కానీ, నీదగ్గరనించి దాచాలని కాదురా" అంది రోహిణి.

" కరక్ట్. నువ్వేమీ సాహిల్ లా చిన్నపిల్లవి కాదు కదా, నీకూ అన్నీ తెలుసు, పైగా బయలజీ అంటే ఎంతో ఇష్టం ఉండడం వల్ల చాలా విషయాలు చదివినదానికి కూడా."

తమ్ముడితో పోలుస్తూ తనని పెద్దదానిగా చూపిచడం స్వప్నిక కి చాలా ఇష్టం. అందుకే రాధిక అలా చెప్పింది.

ఒక్కొక్క మాటా కూడబలుక్కుంటూ వీలైనంత సౌమ్యంగా, క్లుప్తంగా చెప్పారు ఇద్దరూ.

"అయితే నాకేమీ కాదుగా అమ్మా, నిజమేనా నువ్వు చెప్పేది. సినిమాల్లో కేన్సర్ అంటే ఎలాగో చూపిస్తారు కదా" చిక్కటి, నల్లటి కనుపాపల్లో నిండిన భయంతో అడిగింది స్వప్ని.

" ఛా, అలాంటిదేమీ లేదు. ఒకవేళ ఉంటే నాన్నా, మామా గట్టిగా అడగకుండా ఉంటారా? నేను ఊరుకుంటానా? అత్త ఊరుకోనిస్తుందా? నీకు తెలుసుగా, ప్రతీ కండీషన్ లోనూ రకరకాల స్టేజ్ లు ఉంటాయిట. మనం ముందే చూసుకున్నాం అదృష్టవశాత్తూ. అందుకనే డాక్టర్ అంకుల్ అంత ధైర్యంగా చెప్పారు. మనం వచ్చే సారి డాక్టర్ అంకుల్ ని కలవడానికి వెళ్ళినప్పుడు నీకన్ని విషయాలు చెప్పమని అడుగుదాం. మాకు కూడా ఎంతవరకూ అవసరమో అంతే చెప్తున్నారు కదా. అలా కాకుండా మనందరికీ అన్నీ చెప్పేయమని గట్టిగా అడుగుదాం. నువ్వివేమీ ఆలోచించకుండా హాయిగా నిద్రపో" అంది రాధిక.

"ట్రీట్ మెంట్ ఖరీదైనదనేనా ఆ ప్రకటన ఇచ్చారు అయితే?" అపనమ్మకంగానే అడిగింది స్వప్నిక.

" అవును  నాన్నా,  మనకున్న దానికి తోడు అదనంగా ఏదైనా సహాయం దొరికితే మంచిదే కదా అన్న డాక్టర్ అంకుల్ ఆలోచన మేరకు ఈ ప్రకటన ఇచ్చాము.  నీ కోసం ఎక్కడివరకైనా వెళ్ళి పోరాడి నీకు తగ్గేలా చూసుకుంటాం రా నేనూ, మీ నాన్నా. మాకున్న పెద్ద బలం మీ మామా, అత్తా.  నీ బుల్లి తమ్ముడు నీ తోడు. నీకేమీ కాదు. హాయిగా నిద్రపో, ఫేన్ వేసి దుప్పటి కప్పుతాను. నా తల్లి కదూ. నా మాట నమ్ము. ఇది జరిగిన విషయం" అంది కూతురి నుదిటిమీద చెయ్యి వేసి రాస్తూ.

మెత్తటి చీరతో తనే ముఖం తుడుచుకున్న స్వప్నిక, తలి మెత్తటి స్పర్శకి కాస్త తేరుకున్నట్టు గా కనిపించింది. అప్పటికే నీరసంతో కళ్ళు మూతలు పడుతున్న స్వప్నిక ఎంత విందో, ఎంత ఆకళింపు చేసుకుందో తెలియదు కానీ నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది.

“ అమ్మయ్య!" అనుకుంటూ నిట్టూర్చింది రాధిక.

ఆమె పడుకున్న కాసేపటికి కిరణ్ ఇంటికి వచ్చాడు.

రాధిక నెమ్మదిగా విషయం చెప్పింది.

" ఒకరకంగా ఇలా జరగడం మంచిదే లే రాధీ. మభ్య పెట్టడానికి, విషయం దాచడానికీ మరీ చిన్న పిల్ల కాదుగా. పైగా సబ్జెక్ట్ చదువుకుంటున్నది. ఎప్పటికైనా తెలియాల్సిందేగా" అంటూ మౌనంగా ఉండిపోయాడు.

పాప నిద్ర లేచాక తనవంతుగా మరికొంత విషయం తానూ చెప్పాడు.

ముగ్గురు తనకిష్టమైన వాళ్ళు, తనవాళ్ళుదాదాపు ఒకేరకంగా ధైర్యంగా చెప్పడంతో స్వప్నిక కొంత కుదుటపడింది.

తేటపడిన కూతురి ముఖాన్ని చూసి కిరణ్ కొంత సంతోషించాడు.

" చూడు నాన్నా, నువ్వు చిన్నపిల్లవి కాదు. అయినా నీకు చెప్పకుండా ట్రీట్ మెంట్ చేయించడం అనేది జరగదు. మనందరిలోకీ విషయం తెలిసినవారూ, విజ్ఞులూ డాక్టరంకుల్స్ కాబట్టి, వాళ్ళిద్దరిమీద మన భారం అంతా పెట్టి మన సహకారం ఇద్దాం. తొందరలోనే తగ్గిపోతుంది అన్నారు కదా, తగ్గిపోతుంది, అంతే!" అన్నాడు.

తేటగా నవ్వింది స్వప్నిక.

'అమ్మ, నాన్నా, డాక్టర్ అంకుల్ ఎలా చెప్తే అలా వింటాననీ, ఎలాంటి ట్రీట్మెంట్ నైనా చేయించుకుంటానని' ప్రామిస్ చేసింది కూడా.

ఇంతలో ఆటనించి వచ్చిన సాహిల్ " ఏమయింది? అక్క ఎందుకలా ఉంది?" అంటూ ప్రశ్నలు వేశాడు.

చిన్నవాడికి అర్థం కాదు కనక అక్కకి కొద్దిగా ఒంట్లో బాగోలేదు కనక, కొన్నాళ్ళు వాడు అక్కతో పోట్లాడకుండా ఆమెకి తోడుగా ఉండాలని చెప్పారు.

" జ్వరం వస్తోంది కదా, నాకు తెలుసు ఏం చెయ్యాలో. తగ్గేవరకూ అస్సలు పోట్లాడను అక్కా, నువ్వు నా మీద అరవకపోతే జ్వరమే రాదు. హాయిగా కలిసి స్కూల్ కి వెళ్ళచ్చు. అంతే కాదు, మంచం మీద రోజూ నేను పడుకునే కిటికీ పక్కన చోటు అక్కకిస్తాను . దానివల్ల అక్కకి రోజూ కిటికీ పక్కన మొక్కలు కనిపిస్తాయి చక్కగా, బోరింగ్ గచ్చు కాకుండా"

వాడి మాటలకి, స్వప్నిక విషయం అర్థం చేసుకున్న తీరుకి చాలా కాలం తర్వాత స్థిమితంగా నవ్వారు కిరణ్, రాధిక లు.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments